పాఠం 22

# మహిళా రక్షణ చట్టాలు

- మీరెప్పుడైనా చిన్న వయసులో ఉన్నవారికి పెళ్ళిళ్లు జరగడం చూశారా?
- అమ్మాయిలను వేధించడం, హింసించడం ఎప్పుడైనా గమనించారా?
- ఇళ్లల్లో స్త్రీలను హింసించడంగానీ, దూషించడంగానీ, బెదిరించడంగానీ మీరెప్పుడైనా చూశారా?
- ఒకవేళ చూసి ఉంటే ఈ పరిస్థితిని మార్చడానికి మనం ఏం చేస్తే బాగుంటుంది?

ప్రపంచ వ్యాప్తంగా ఆడపిల్లలు, మహిళలు ఇంటా బయటా హింస, వేధింపులను ఎదుర్కొంటున్నారు. ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్నది. చాలా మంది యువతులు స్వేచ్ఛగా బయట తిరగడానికి సాహసించడం లేదు. అలాగే ఆడ పిల్లలు బడికి వెళ్ళడానికి కూడా భయపడుతున్నారు. మాటలతో వేధించడం, బాధించడం, తక్కువ చేసి మాట్లాడటం, మీరేమీ చేయలేరని ఎగతాళి చేయడం. శారీరకంగా, మానసికంగా, లైంగికంగా హింసించడం వంటివి మన చుట్టుపక్కల గమనించటమే కాకుండా టి.వి.ల్లో, వార్తా పత్రికల్లో కూడా చూస్తున్నాం. ఈ సంఘటనలు వారి మానవ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయనడానికి నిదర్శనం. వీటిని అరికట్టడానికి ఆయా ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేసినప్పటికి, వాటిపై చాలా మందికి అవగాహన లేదు. బాధితులకు ప్రభుత్వం నుండి ఏ విధమైన రక్షణ, సహాయం ఎక్కడ ఎలా పొందవచ్చునో కూడా తెలియదు.

తమ రక్షణకు సంబంధించిన చట్టాలపై బాలికలు, మహిళలందరూ అవగాహన పొందాలి. అప్పుడే తమను తాము అన్ని హింసలనుండీ, వేధింపుల నుండీ రక్షించుకోవడానికి వీలవుతుంది. ఆడపిల్లలు, స్త్రీలు గోప్యంగా/స్వేచ్ఛగా తమ బాధలను చెప్పుకోవడానికి అవసరమైన యంత్రాంగం ఉన్నదా? ఉంటే ఎక్కడ, ఏ రూపంలో మొదలగు అంశాలను ఈ పాఠంలో చర్చిద్దాం.

మన సమాజంలో బాలల, మహిళల హక్కుల ఉల్లంఘన ఏదో ఒక రూపంలో జరుగుచున్నది. అది కుటుంబంలో కావచ్చు, పనిచేసే కార్యాలయంలో కావచ్చు. ఈ విధమైన మానవ హక్కుల ఉల్లంఘన ఇంకా ఎంత కాలం కొనసాగాలి? బాలల, మహిళల సమగ్ర అభివృద్ధిని కాలరాస్తున్న పై పరిస్థితులను, సమాజ వైఖరులను చక్క దిద్దాల్సిన అవసరం ఎంతో ఉన్నది. ఇందుకోసం ప్రభుత్వం చేసిన చట్టాల సక్రమ అమలు ద్వారా బాల బాలికలు స్వేచ్ఛగా తమ భావి జీవితాన్ని ఆనందమయంగా గడపడానికి వీలువుతుంది.

ఐక్యరాజ్యసమితి 1989లో రూపొందించిన బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికపై 191 దేశాలు సంతకాలు చేశాయి. వీటిలో మనదేశం కూడా ఒకటి. ఇవి ప్రజలందరికి ఏ విధమైన వివక్షత లేకుండా వర్తించబడతాయి. ఈ హక్కులలో కొన్ని ప్రధానమైన వాటిని చూద్దాం.

## బాలల హక్కులు

1. లింగ భేదం లేకుండా 18 సం॥లోపు వ్యక్తులందరూ బాలలే.
2. ప్రభుత్వపరంగా బాలల హక్కులకు భద్రత కలిగించడం
3. జీవించే హక్కు
4. సాధ్యమైనంత వరకు బాలలు తల్లిదండ్రులతో కలసి ఉండటం.
5. విషయ పరిజ్ఞానం పెంచుకోవటం, సమాచార సాధనాలైన రేడియో, వార్తాపత్రికలు, పుస్తకాలు, టి.వి ద్వారా ప్రపంచంలోని విషయాలపై అవగాహన పెంచుకునే హక్కు
6. బాధాకరమైన, దౌర్జన్యకరమైన, హానికరమైన సంఘటనలు జరగకుండా రక్షణ పొందే హక్కు

7. బాలలకు ఏదైనా శారీరక దౌర్బల్యం వుంటే వారు సంపూర్ణమైన జీవితం గడపడానికి, అభివృద్ధిలోకి రావటానికి ప్రత్యేక విద్య, ప్రత్యేకమైన సంరక్షణ పొందే హక్కు.
8. బాలలు సంపూర్ణ ఆరోగ్యం, వైద్యసౌకర్యం పొందే హక్కు.
9. బాలల మాతృభాషను వాడే హక్కు, వారి సహజ సాంప్రదాయాన్ని, మతాన్ని పాటించే హక్కు.
10. కొంత సమయం ఆటలాడుకునే హక్కు
11. బాలల విద్యకు, ఆరోగ్యానికి హాని కలిగించే పని చేయకుండా ఉండటం.
12. హానికరమైన మందులను వాడటం, తయారు చేయటం, కొనటం చేయకుండా రక్షణ పొందటం.
13. బాలలు బాధింపబడినా, నిర్లక్ష్యం చేయబడినా లేక సరిగా చూడబడకపోయినచో సహాయం పొందే హక్కు.

పిల్లలు, పెద్దలు, ప్రజలంతా ఈ ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒడంబడిక గురించి అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వం ప్రజలందరికీ దీని గురించి తెలియచేయాలి.

## బాల్య వివాహాల నిషేధ చట్టం, 2006

బాలుడు అంటే 21 సంవత్సరాలు నిండనివారు. బాలిక అంటే 18 సంవత్సరాలు నిండనివారు. వివాహ సమయంలో వీరిరువురిలో ఏ ఒక్కరి వయసైనా పేర్కొన్నదానికన్నా తక్కువగా ఉంటే బాల్యవివాహంగా పరిగణిస్తాం. ఒకవేళ మరో పురుషుడు 21 సంవత్సరాల పైబడినవాడు బాల్య వివాహం చేసుకుంటే అతడికి 2 సంవత్సరాల జైలు శిక్ష/ లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఇలాంటి వివాహం చేసుకున్నవారు లేదా వాటిని ప్రోత్సహిస్తున్నవారు బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం నేరుస్తులవుతారు, శిక్షించబడతారు. బాల్య వివాహం రద్దయిన తరవాత ఆ బాలికకు తిరిగి వివాహం అయ్యే వరకు పురుషుడు మనోవర్తి చెల్లించాలి. ఒకవేళ ఆ వివాహంలోని వ్యక్తి మైనర్ అయితే అతని తల్లిదండ్రులు చెల్లించాలి. బాల్య వివాహం నుండి బయటపడిన పిల్లల సంరక్షణకై ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుంది. వివాహ సమయంలో ఇచ్చిన కానుకలను వివాహం రద్దు తరవాత తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది.




**బాల్య వివాహాల దుష్ఫలితాలు:**

- చిన్న వయసులో గర్భవతులు కావడం.
- ఆడపిల్లల అక్రమ రవాణాకు, అమ్మకానికి అవకాశం ఏర్పడడం.
- ఎదుగుదల లేని పిల్లలను బలవంతంగా కుటుంబ వ్యవస్థలోకి నెట్టివేయడం.
- అధిక సంఖ్యలో గర్భవిచ్ఛిత్తి, నెలలు నిండక ముందే ప్రసవం జరగడం, ఫలితంగా మాతృమరణాల, శిశుమరణాల సంఖ్య పెరగడం.
- వైకల్యంతో కూడిన శిశు జననాలు లేదా మృత శిశువులు జన్మించడం.
- మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తడం.
- చదువుకు ఆటంకం.
- శారీరక ఎదుగుదలకు అటంకం (ప్రత్యేకంగా ఆడపిల్లల విషయంలో).
- కుటుంబ పోషణకై బాల కార్మికులుగా మారుట.

© SCERT not to be republished

## ఆప"బడి"న బాల్య వివాహం – ఒక విజయ గాథ

*రావిరాళ్ల కవిత , వయస్సు పన్నెండు సంవత్సరాలు, తండ్రి నాంచారయ్య. వారిది మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డి గ్రామం. ఈ అమ్మాయి ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నది. ఆ అమ్మాయికి వివాహం నిశ్చయించడంతో పాఠశాలకు రావడం లేదు. ఈ విషయం మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ (MVF) వారికి తెలియడంతో ఆ అమ్మాయి ఇంటికి ఆ ఫౌండేషన్ కార్యకర్తలు, బాల్య వివాహ నిషేధ సమితి సభ్యులు వెళ్ళి ఊరి పెద్దల సమక్షంలో కవిత వివాహం గురించి చర్చించారు.*

*MVF వారు గ్రామపూజారి వద్దకు వెళ్లి విచారించగా కవిత తల్లిదండ్రులు తన వద్దకు వచ్చారని కవిత వయస్సుపై అనుమానం వచ్చి పుట్టిన తేది లేదా రేషన్‌కార్డును తీసుకొని రమ్మన్నానని వారు ఏది చూపకపోగా తిరిగి తన వద్దకు రాలేదని చెప్పాడు. విచారణలో పెండ్లి కొడుకు కల్వపాడు గ్రామానికి చెందిన దామెర్ల చినసత్యం, అతని వయస్సు 23 సంవత్సరాలని, తండ్రి రామయ్య అని ఇతను ప్రాథమిక పాఠశాల పూర్తి చేయలేదని తెలిసింది.*

*రెండు రోజుల అనంతరం MVF వారు కవిత ఇంటికి వెళ్లగా వారు పెండ్లి పనుల్లో ఉన్నారు. చదువుకునే వయసులో పెళ్లి చేయొద్దని, అమ్మాయికి ఇంకా మైనారిటీ తీరలేదని కౌన్సెలింగ్ చేయడం మొదలుపెట్టారు. దానితో అమ్మాయి తండ్రి "మీకేమిటి? మీరు ఎన్నైనా చెబుతారు. మాకు మరో అమ్మాయి ఉంది. వీళ్ల వివాహం ఎలా? అని ఎదురు ప్రశ్నలు వేశాడు. వారెంతకూ వినకపోవడంతో తహశీల్దారు, స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్, CDPO లకు తెలియజేశారు. మరుసటి రోజు గ్రామస్థుల సమక్షంలో కవిత తల్లిదండ్రులను విచారించారు. అయితే వారు "మా అమ్మాయి పెళ్లి చేసుకుంటే మీరెవరు ఆపడానికి? అని గొడవ చేశారు. అదే సమయంలో అబ్బాయి తరుపు వారు వచ్చి "అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరవాత పెళ్లి ఆపేస్తే ఎలా? అంటూ ప్రశ్నించడం మొదలుపెట్టారు. సబ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.... బాల్య వివాహాలు చేయడం నేరం. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిని కూడా శిక్షించవలసి వస్తుంది" అంటూ కౌన్సెలింగ్ చేశారు. అమ్మాయి, అబ్బాయి తరపు వాళ్లందరినీ ఒప్పించి వివాహం రద్దు చేసి అమ్మాయిని రోజూ బడికి పంపించే విధంగా ఒప్పించారు.*

© SCERT not to be republished

బాల్య వివాహాల నిరోధానికి జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మండల స్థాయిలో తాసిల్దార్/ఐసిడిఎస్ అధికారి, గ్రామ పంచాయితీ స్థాయిలో పంచాయితీ కార్యదర్శి ఉంటారు. బాల్య వివాహాలు జరిగినప్పుడు వీరిలో ఎవరికైనా ఫిర్యాదు చేసి బాల్య వివాహాలను నిరోధించవచ్చు. నమ్మదగిన సమాచారం ఉన్నప్పుడు కోర్టు తనంతట తానే సుమోటో కేసుగా స్వీకరించి సంబంధీతులకు శిక్ష విధిస్తుంది.

- అప్పుడప్పుడు 15 సంవత్సరాలు కూడా నిండని పిల్లలకు వారి ప్రమేయం, ఇష్టాయిష్టాలు చూడకుండా పెళ్ళిళ్ళు చేస్తున్నారు. ఇలాంటివి ఎలా ఆపవచ్చు? ఎవరు సహాయం చేస్తారు?

### మీకు తెలుసా?

టోల్ ఫ్రీ నెంబర్ భూమిక హెల్ప్ లైన్ *1800 425 2908* ఈ నెంబర్‌కు ఎప్పుడైనా, ఎవరైనా ఫోన్ చేసి బాల్య వివాహం ఆపవచ్చు. బాలికలు/ బాలురు, వారి స్నేహితులు, గ్రామ యువకులు, వారి ఉపాధ్యాయులు లేక స్వచ్ఛంద సంస్థల ద్వారా తహసీల్దారుకు లేక గ్రామ కార్యదర్శికి చెప్పి వివాహం ఆపే ప్రయత్నం చెయ్యవచ్చు.

## అక్రమ రవాణా నిరోధక చట్టం (1956), సవరణ 2006

బాలికలను, యువతులను ఉద్యోగం లేక పని ఇప్పిస్తామని, సినిమాలో చేరుస్తామని, మంచి భవిష్యత్తు చూపిస్తామని చెప్పి వేరే పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్ళి వారిని వేరే వారికి అమ్మివేసి వారిచే బలవంతంగా వ్యభిచారం చేయించడం, వారు చెప్పినట్లు చేయకుంటే కొట్టి, హింసించి బలవంతంగా చేయిస్తారు. ఒక్కొక్కసారి శరీర అవయవాలను కూడా తొలగిస్తారు.

ఆశ చూపి ఒక స్థలం నుండి వేశ్యా గృహానికి తీసుకెళ్ళడం, ఇష్టపడి వచ్చిన నేరం అవుతుంది. అలాగే వృత్తిలోకి బలవంతంగా దించడానికి నిర్బంధం చేయడం, లేక ప్రోత్సహించడం నేరం.

**అక్రమ రవాణా రూపాలు**

- **లైంగిక దాడి**
  1. బలవంతపు వ్యభిచారం.
  2. సాంఘిక, మతపరమైన వ్యభిచారం (దేవదాసి, జోగిని, మాతాంగి మొ॥వి).
  3. పర్యాటకరంగంలో లైంగిక దోపిడి.
  4. అసభ్యత, అశ్లీల రచనలు-చిత్రాలు చూపించడం.
- **చట్టవ్యతిరేక కార్యకలాపాలు**
  1. అక్రమరవాణాకు గురైన వారిచే భిక్షాటన చేయించి డబ్బు సంపాదించడం, దానికై వారిని హింసించడం, బాధించడం, కొన్ని సమయాలలో అవయవాలు తొలగించి, వికలాంగులుగా మార్చి భిక్షాటన చేయించటం
  2. మానవ అవయవాలను తీసి అమ్మివేసి వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదించడం.
  3. అక్రమ రవాణా చేయబడిన వారిచే మత్తుమందుల అమ్మించి లాభాలు గడించడం.
- **కార్మికులు**

1. వెట్టిచాకిరి : కూలీ ఇవ్వకుండా పనిచేయించుకొని ఇబ్బందులకు గురిచేయడం. సరియైన పోషకాహారం, బట్టలు ఇవ్వకపోడం. వారిని కనీసం మనష్యులుగా చూడకపోవడం.
2. ఇళ్లలో పని : బట్టలు ఉతకడం, ఇళ్లు తుడవడం, పాత్రలు శుభ్రం చేయడం, వంటి పనులు చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం. ఇతరుల ఇళ్ళల్లో కూడా పనిచేయించడం.
3. వ్యవసాయ కూలీ : వ్యవసాయ పనులకు తీసుకెళ్ళి ఎక్కువ పనిచేయించి శారీరక శ్రమకు గురిచేసి వారి శ్రమను దోచుకోవడం.
4. **నిర్మాణ కూలి :** భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు మొదలైన వాటిలో పని చేయించుకొని అతి తక్కువ, నామమాత్ర డబ్బులు ఇవ్వడం లేదా తక్కువ నాణ్యత గల భోజనం ఇచ్చి పని చేయించుకోవడం.

- **పైశాచిక ఆనందం**
  1. ఒంటెలపై పిల్లల్ని కట్టేసి, పరుగెత్తించే వినోద ప్రదర్శన
  2. వారి సమ్మతిలేని పెళ్లిళ్లు, దత్తత

సాధారణంగా ఈ అన్యాయాలు జరిగినపుడు చాలా వరకు సహిస్తారు. ఎవరికి చెప్పరు. కాని తప్పకుండా ఇలా సహించబడేవారు. సమాచారాన్ని తహసిల్దార్, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ లేక స్వచ్ఛంద సంస్థలకు చెప్పి అన్యాయాన్ని అరికట్టాలి.

బలవంతంగా వ్యభిచారం చేయించడం నేరం. ఈ విధంగా వ్యభిచారం చేసేవారిని సెక్స్‌వర్కర్స్ అంటారు. వీరి రక్షణకు సంబంధించి ఎన్నో చట్టాలు అమలులో ఉన్నాయి. విచారణ నిమిత్తం వీరిని

© SCERT not to be republished

కొట్టడానికి, దౌర్జన్యం చేయడానికి పోలీసులకు అధికారం లేదు. సెక్స్‌వర్కర్స్‌తో పాటు వ్యభిచారం చేయించేవారికి కూడా 2 నుండి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10,000ల వరకు జరిమానా విధించవచ్చు. ఇంటినో లేదా గదినో వేశ్యాగృహంగా నడపడానికి, వాడుకోవడానికి అద్దెకు ఇవ్వడం కూడా నేరమే.

ఎవరైనా తన భార్య లేదా భర్త కాకుండా మరొక వ్యక్తితో లైంగిక సంబంధాలు కొనసాగిస్తే నేరంగా పరిగణించి శిక్ష విధించబడుతుంది.

అక్రమ రవాణా నుంచి కాపాడబడిన తరవాత వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి. ఒక మహిళా పోలీసు లేదా ప్రభుత్వేతర సేవా సంస్థచే విచారణ జరిపించి సంరక్షణకై చర్యలు తీసుకోవాలి. బాలలైతే బాలసదనానికి పంపించాలి. కాపాడబడిన వారికి పూర్తి సంరక్షణ, గౌరవం ప్రభుత్వం కల్పిస్తుంది. బాధితులు పిల్లలైతే వారిని బాలల సంక్షేమ కేంద్రాలకు అప్పగించి వారికి చదువు భోజన వసతి కల్పిస్తారు.

అక్రమ రవాణా ఒక పెద్ద నేరం. ఈ నేరానికి7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష నుండి జీవిత ఖైదు వరకు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు. పోలీసులు వారంటు లేకుండా కూడా ఈ నేరం పరిశోధించవచ్చు. వివరాలను సేకరించి వారిని కాపాడి దోషులకు శిక్ష పడేటట్లు చేయవచ్చు.

## వరకట్న నిషేధ చట్టం, 1961

కట్నం ఇవ్వటం, కట్నం తీసుకోవటం లేదా ఈ రెంటికీ తోడ్పడటం, కట్నం అడగటం అనేవి నేరాలు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి 5 సం॥ తగ్గకుండా జైలు శిక్ష, 15 వేల వరకు జరిమానా లేదా కట్నం విలువ మొత్తంలలో ఏది ఎక్కువైతే ఆ మొత్తం జరిమానాగా విధించబడును.




చాలా సందర్భాల్లో వివాహం అయిన తర్వాత అమ్మాయిని వేధించడం, తిట్టడం, కొట్టడం, ఒక్కోసారి చంపివేయటం కొన్నిసార్లు బాధలు భరించలేక స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోవటం మొదలైనవన్ని ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. అయితే తల్లిదండ్రులు ఎవరి నుండి ఒత్తిడి లేకుండా, తమ ఇష్టానుసారం ఏదైనా ఇచ్చుకోవచ్చు. కాని ఈ కానుకలు కూడా చట్ట ప్రకారమే ఇవ్వాలి.

1. కానుకలన్నిటి జాబితా విడిగా ఉండాలి.
2. కానుకలను అడిగి తీసుకోరాదు.
3. వధువునకు ఇచ్చే కానుకలు ఆచారం, సంప్రదాయం ప్రకారం ఇవ్వవలసినవై ఉండాలి. వాటి విలువ ఆమె తల్లిదండ్రుల స్థోమతకు తగినట్లుగా ఉండాలే తప్ప వారి తలకు మించిన భారం కాకూడదు.

- మీ నివాస ప్రాంతంలో కట్నం కోసం మహిళలను వేధించడం గమనించారా? ఎలాంటి వేధింపులు జరుగుతున్నాయి. దీనిని నిరోధించాలంటే సమాజంలో ఎలాంటి మార్పులు రావాలి. ఎవరు బాధ్యత వహించాలి.

© SCERT not to be republished

మహిళపై హింస జరుగుతున్న విషయాన్ని బాధితురాలు స్వయంగా లేదా ఆమె తండ్రి/తల్లి/సోదరుడు/సోదరి/బంధువులు, రక్తసంబంధీకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చు.

## గృహ హింస నుండి మహిళలు రక్షణ పొందే చట్టం, 2005

మన రాజ్యాంగం పౌరులందరికీ గౌరవంగా బ్రతికే హక్కును ఇచ్చింది. స్త్రీలు కూడా పౌరులే. వారు గౌరవంగా బ్రతకడం అంటే వారిని ఎవరూ దూషించకుండా, అవమానించకుండా ఉండటం. స్త్రీలు చేసే పనిని గౌరవించటమే గాక వారికున్న హక్కులను అనుభవించేటట్లు పరిస్థితులు కల్పించడం. స్త్రీలు మనుషులుగా అన్ని హక్కులను వినియోగించుకోకుండా వారి విలువ, గౌరవం దెబ్బతినే చర్యలు పరిస్థితులు ఇంట్లో/ కుటుంబం నుండే మొదలౌతాయి. కుటుంబంలో జరిగే ఈ హింసాపూరిత చర్యలు స్త్రీలను అణచివేస్తూ వారి అభివృద్ధికి ఆటంకం అవుతున్నాయి.

ఈ గృహ హింస తీవ్రతలో, స్వభావంలో, రూపంలో తేడాలు ఉండవచ్చు గాని, ఇది ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల అభివృద్ధికి ఆటంకమైన ఒక పెద్ద సమస్య. కాబట్టి కుటుంబ హింస అంటే ఒక కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగతమైన సమస్యకాదు. స్త్రీలపై జరిగే ఏ హింస అయినా అది వ్యక్తిగతం కాదు, దాని వెనుక రాజకీయముంటుందని స్త్రీల ఉద్యమం గత 20 సంవత్సరాలుగా నొక్కిచెబుతుంది. ఆ పోరాటాల ఫలితంగా స్త్రీలకు కొంత వరకు రక్షణ కలగజేయడానికి కొన్ని ప్రత్యేకమైన చట్టాలు వచ్చాయి. అయినప్పటికీ ఆ చట్టాల నిర్వచనంలో, ఆచరణలో, యంత్రాంగంలో కీలకమైన పోలీసు, న్యాయవ్యవస్థ, ఇతర సహాయక సంస్థలకు స్త్రీల సమస్యల పట్ల, అణచివేత పట్ల, వారిపై జరిగే హింస పట్ల అవగాహన, సున్నితత్వం లేకపోవడం వల్ల చట్టాలుండి కూడా నిరుపయోగంగా తయారయ్యాయి.

ఒక వైపు కుటుంబం, సమాజం ఈ హింసను సమర్థిస్తూనే ఉన్నా, గత 20 సంవత్సరాలుగా స్త్రీల ఉద్యమాల ఫలితంగా మన ప్రభుత్వాలు స్త్రీలపై జరిగే ఈ హింసను గుర్తించి దాన్ని ఆపడం ముఖ్యమని, లేకపోతే జనాభాలో దాదాపు సగం అయిన స్త్రీల అభివృద్ధికి ఇది అవరోధమయినపుడు ప్రపంచం పరిపూర్ణమయిన అభివృద్ధిని సాధించలేదని అంతర్జాతీయంగా గుర్తించి కొన్ని ఒప్పందాలు, తీర్మానాలు తయారుచేశారు. ఈ తీర్మానాలలో స్త్రీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చేపట్టవలసిన చర్యలను కూడా సూచించారు. ఈ తీర్మానాలలో అనేక దేశాలతో పాటు మన దేశం కూడా సంతకం చేసి ఆ నిబంధనలకు కట్టుబడి ఉంది.

- గృహ హింస ఎప్పుడో ఒకసారి అప్పుడప్పుడు మొదలై రాను రాను దురలవాటుగా మారిపోతుంది. హింస నుండి మరింత హింస పుడుతుంది. దీన్నిఎలా ఆపవచ్చు. ఎవరు సహాయపడతారు.

**తీర్మానాలలో ముఖ్యమైనవి :**

- "పెళ్లి, కుటుంబ సంబంధాల విషయంలో స్త్రీల పట్ల వివక్షను తొలగించే విధంగా, స్త్రీ పురుషుల సమానత్వం ప్రాతిపదికగా ప్రభుత్వాలు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలి."
- "స్త్రీ, పురుషులిద్దరికి కూడా ఆస్థి భాగస్వామ్యంలో, అనుభవించడంలో, యాజమాన్యంలో సమానమైన అధికారం ఉండాలి.

**బీజింగ్ ఒప్పందం కార్యాచరణ నివేదిక ఇలా పేర్కొంటుంది**

- "సమాజంలో పురుషుల కంటే స్త్రీలు తక్కువ స్థానంలో ఉండటానికి స్త్రీలపై జరిగే హింస ఒక సాధనం. చాలా సందర్భాలలో స్త్రీలు, బాలికలపై హింస అనేది కుటుంబంలో, ఇంట్లో జరుగుతుంది. కుటుంబ హింసకు సంబంధించిన సంఘటనలు చాలా వరకు బయటకు రావు. కాబట్టి వీటిని గుర్తించడం చాలా కష్టం.

- ఒకవేళ ఈ హింసను గుర్తించినా బాధితులను కాపాడటం, బాధ్యులను శిక్షించడంలో ప్రభుత్వాలు సఫలీకృతం కాలేకపోతున్నాయి."
- "హింసతో బాధపడుతున్న స్త్రీలకు చట్టపరమైన, న్యాయపరమైన రక్షణకు సంబంధించిన అన్ని రకాలైన వ్యవస్థలను అందుబాటులో ఉంచాలి. దీనికి సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి."

ప్రతి సంవత్సరం లక్షల మంది మహిళలు గృహహింస వల్ల గాయాలపాలై చికిత్సపొందుతున్నారు. కానీ కారణం గృహహింస అని చెప్పరు. అన్ని జాతుల, తెగల, మతాల, సామాజిక, ఆర్థిక శ్రేణుల్లో ఇది సర్వవ్యాప్తిలాగా కనిపించినా, నాలుగు గోడల నడుమ జరిగే కుటుంబ వ్యవహారమని భావిస్తున్నారు.

## గృహహింస : భ్రమలు, వాస్తవాలు

భ్రమ : ఎప్పుడో ఒకసారి తల్లిదండ్రులు పిల్లలను కొడితే అదేం పెద్ద పట్టించుకోవలసిన అంశం కాదు.

వాస్తవం : గృహ హింస చర్యలు ఇలాగే మొదలై రాను రాను ఎదురులేకపోతే దురలవాటుగా మారిపోతాయి. ఇటువంటి హింసల వల్ల కలిగే గాయాలతో ఆసుపత్రుల పాలు కావలసి వస్తుంది. కొన్ని సార్లు ప్రాణాలు పోతాయి. తరచు దెబ్బతినే వారి ఆత్మగౌరవం పైన, ఔన్నత్యం మీద ఎంతో వ్యతిరేక ప్రభావం పడుతుంది.

భ్రమ : తాగుడుకు బానిస కావడం.

వాస్తవం : తాగుడు కేవలం ఒక సాకు మాత్రమే. దెబ్బలు కొట్టే మగవారిలో 40 శాతం అసలు తాగరని గణాంకాలు చెబుతున్నాయి.

భ్రమ : ఆడవారు పిల్లల కోసం హింసను భరిస్తూ ఉంటారు.

వాస్తవం : హింస నుండి మరింత హింసపుడుతుంది. హింసాత్మక వాతావరణంలో పెరిగిన పిల్లలు హింసాత్మకంగామారే అవకాశం ఎక్కువ.

భ్రమ : గృహహింస నుండి బయటపడే మార్గమే లేదు.

వాస్తవం : హింసలేని వాతావరణం ప్రతి స్త్రీ జన్మహక్కు, మహిళలకు మద్దతునిచ్చే, రక్షణనిచ్చే చట్టాలు ఉన్నాయి.

### గృహ హింస రూపాలు:

- లైంగిక అత్యాచారం (బలవంతంగా లైంగిక క్రియలో పాల్గొనేటట్లు చేయడం, అశ్లీల దృశ్యాలు చూడమని బలవంతం చేయడం).
- భౌతిక అత్యాచారం (శారీరకంగా నొప్పి, బాధ కల్గించే ప్రవర్తన, కొట్టడం, హింసించడం).
- మానసికంగా క్షోభకు గురిచేసే మాటలనడం (అవమానించడం, పేర్లు పెట్టడం, చులకన చేయడం, మాట్లాడకపోవడం, పట్టించుకోకపోవడం).
- మానసిక అత్యాచారం (హాని కల్గిస్తామని బెదిరించడం, పిల్లలను చదివించబోమని బెదిరించడం, ఉద్యోగం చేయకుండా ఆపడం, ఇష్టంలేని వ్యక్తిని పెళ్లి చేసుకొమ్మనడం వంటివి).
- ఆర్థిక అత్యాచారం (చెందవలసిన ఆర్థిక వనరులు చెందకుండా చేయడం, స్త్రీ ధనాన్ని వాడుకోవడం, వారి ఆస్తులను అమ్మడం మొదలైనవి).

© SCERT not to be republished

### ఎవరికి ఫిర్యాదు చేయవచ్చు?

గృహ హింసకు గురైనవారు పోలీస్ అధికారికి లేదా జూడీషియల్ అధికారికి, ఫస్ట్‌క్లాస్/ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటుకు స్వయంగా/ ఫోన్‌ద్వారా/ ఇ-మెయిల్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చు. గృహ హింస జరిగినప్పుడు, జరుగుతున్నప్పుడు, జరుగుతుందని తెలిసినప్పుడు ఇలాంటి ఫిర్యాదులు చేయవచ్చును. బాధితురాలు గాయాలపాలై ఉంటే వైద్య పరీక్షలు నిర్వహింపజేసి ఆ రిపోర్టును పోలీస్ స్టేషన్‌లో, మెజిస్ట్రేట్ ముందు ఉంచాలి.

## అత్యాచారం, లైంగిక వేధింపులు

ఇటీవల మనదేశంలో ఈ రకమైన వేధింపుల నిరోధానికి, అత్యాచార నియంత్రణకు జస్టిస్ జె.యస్. వర్మ అధ్యక్షతన ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచించిన అంశాల ప్రాతిపదికన భారత రాష్ట్రపతి 2, ఫిబ్రవరి 2013న ఆర్డినెన్సును జారీచేశారు. దీని ముఖ్యాంశాలు

- కనీసం 20 సంవత్సరాల జైలు శిక్ష.
- బాధితుల నుండి ఫిర్యాదులు తీసుకోవడానికి మహిళా పోలీసుల నియామకం.
- బాధితులు వ్యక్తిగతంగా పోలీసు అధికారుల ముందు ఉపస్థితి కావలసిన అవసరంలేదు.
- మహిళలపై ఆసిడ్ దాడి సందర్భంలో జరిగిన పెనుగులాటలో దాడి చేసిన వారు మరణించినా మహిళకు ఎలాంటి శిక్షలేదు.
- ఫిర్యాదు, విచారణ సందర్భంగా బాధితుల కోరిక మేరకు వీడియో చిత్రీకరణకు అవకాశం కల్పించబడింది.

## లోక్ అదాలత్

లోక్ అదాలత్ అనగా ప్రజాన్యాయ స్థానం. న్యాయం దృష్టిలో అందరూ సమానులే. న్యాయానికి గొప్ప, బీద అన్న తేడా లేదు. అందరికీ సమానవకాశాలు కల్పించడానికి ముఖ్యంగా ఏ పౌరుడూ ఆర్థిక కారణాల మూలంగా గాని మరే ఇతర బలహీనతల మూలంగా గాని న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సహాయం అందించాలని ప్రభుత్వం భావించింది. బీద, బలహీన వర్గాల వారికి న్యాయ సహాయం అందుబాటులోకి తేవడం కోసం, వారికి సామాజిక ఆర్థిక న్యాయాలు కల్పించడం కోసం ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని నిశ్చయించినారు. ఫలితంగా 1976వ సంవత్సరంలో భారత రాజ్యాంగానికి అధికరణ 39(ఎ) జతచేసి బీద, బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని నిశ్చయించినారు.

అంతేకాకుండా ఇందుకోసం ఒక చట్టాన్ని రూపొందించినారు. అదే న్యాయ సేవల అధికార చట్టము. ఇది కేంద్ర చట్టము. ఈ చట్టము నిర్దేశించినట్టు మన రాష్ట్ర ప్రభుత్వము, రాష్ట్ర హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలను రూపొందించినారు.

న్యాయ సహాయం పొందటానికి ఎవరు అర్హులు

- షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందినవారు.
- మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు, స్త్రీలు, పిల్లలు, మతిస్థిమితం లేనివారు, అవిటివారు.
- ప్రకృతి వైపరీత్యాల బాధితులు; వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులు, హింసాకాండ, కుల వైషమ్యాల బాధితులు?
- రూ. 50,000 కంటే తక్కువ సాంవత్సరిక ఆదాయం కలవారు.



© SCERT not to be republished

దరఖాస్తు చేయవలసిన చిరునామా: ఉచిత న్యాయ సహాయం కోరువారు తమ తమ జిల్లాలకు చెందిన జిల్లా కోర్టులందు, రాష్ట్ర హైకోర్టునందు గల జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలకు గాని, తమ కేసుల వివరాలను తెలుపుతూ దరఖాస్తు చేసుకొనవచ్చును.

| | |
|---|---|
| 1. సెక్రటరీ, | 2. మెంబర్ సెక్రటరీ |
| జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ | రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ |
| జిల్లా కోర్టు భవనములు | హైకోర్టు భవనములు, హైదరాబాద్-500 066 |

**న్యాయ సహాయ విధానాలు**

- న్యాయవాదిచే ఉచితంగా న్యాయ సలహా ఇప్పించుట.
- కేసులను పరిశీలించిన మీదట అవసరమైనచో దరఖాస్తుదారుని తరపున న్యాయవాదులను నియమించి ఆయా కోర్టులలో కేసులు చేపట్టడం.
- న్యాయ సహాయం పొందిన వారికి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన కోర్టు ఖర్చులు భరించడం.
- న్యాయ సహాయం పొందిన వారికి ఆయా కేసులలో తీర్పుల నకల్లు ఉచితంగా ఇవ్వడం మొదలగు సహాయాలు అందించబడతాయి.

అయితే ఏ చట్టాలైనా సమర్థవంతంగా అమలు జరగాలంటే వాటిపైన పూర్తి అవగాహన పొంది సమయానుకూలంగా వినియోగించినప్పుడే మనకు ఉద్దేశించిన మానవ హక్కులను అనుభవించగల్గుతారు.

## కీలక పదాలు

1. వరకట్నం
2. గృహ హింస
3. లోక్ అదాలత్
4. లైంగిక అత్యాచారం
5. బలవంతపు వ్యభిచారం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. బాల్య వివాహాల దుష్ఫలితాలు ఏవి?
2. గృహహింస ఎందుకు సర్వసాధారణమైంది? కారణాలు రాయండి.
3. మీరు బాలికలు, మహిళల యొక్క వివిధ సమస్యల గురించి చదివారు. ఇలాంటి సమస్యలు మీ గ్రామంలో లేదా పట్టణంలో ఎప్పుడైనా గమనించారా? అయితే, ఏం చేయాలి?
4. బాలికలు, మహిళల సంరక్షణకై ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేసింది. వాటిని సక్రమంగా అమలుచేయడానికి మీరిచ్చే సూచనలు ఏవి?
5. మహిళలు ఎదుర్కొనే సాధారణ సమస్యలపై ఒక వ్యాసం రాయండి.
6. మీరు తహశీల్దారు అయితే, బాల్య వివాహాలను ఎలా అరికడతారు?

## ప్రాజెక్టు

పేదవారికి, ఉచిత న్యాయ సహాయం పొందటానికి ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తుంది. మీకు సమీపంలో ఉన్న వకీలు / ప్లీడరును సంప్రదించి సమాచారం సేకరించండి.

© SCERT not to be republished